క్లుప్తంగా

ఆకట్టుకున్న చారిత్రాక కట్టడాల నమూనాల ప్రదర్శన



తెనాలి అర్బన్: మదీనా మసీదు కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులు శుక్రవారం చారిత్రాక కట్టడాల ప్రదర్శన నిర్వహించారు. మసీదు ఏర్పాటు చేసిన ప్రదర్శనలో దిల్లీలోని ఎర్రకోట, కుతుబ్‌మీనార్, ఇండియా గేట్, హైదరాబాద్‌లోని చార్మినార్, ఆగ్రాలోని తాజ్‌మహల్ తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. జాతీయ పతకాన్ని నమూనాలపై అలంకరించి అందంగా తీర్చిదిద్దారు. కార్యక్రమాన్ని మదీనా మసీదు ఇమామ్ ముఫ్తీ ఉస్మాన్‌ఖాన్, ముతవల్లి హాజీ షేక్ యాకూబ్, మహమ్మద్ సలీం పర్యవేక్షించారు.

ఉత్సవ వాతావరణంలో 'వ్యూహం' పాట చిత్రీకరణ



తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ జీవితంలో జరిగిన ఘటనలపై రామదూత క్రియేషన్స్ పతాకంపై రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో తెనాలికి చెందిన దాసరి కిరణ్‌కుమార్ నిర్మిస్తున్న 'వ్యూహం' సినిమా షూటింగ్ ఇక్కడ శుక్రవారం కూడా కొనసాగింది. స్థానిక చెంచుపేటలోని చావాస్ గ్రాండ్ ఫంక్షన్ హాలు ఆవరణలో వైఎస్సార్ విగ్రహం ఎదుట ఉత్సవ వాతావరణంలో ఓ పాట సన్నివేశాన్ని చిత్రీకరించారు. దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఆన్‌లైన్‌లో సూచించిన ప్రకారం సహాయకులు చిత్రీకరణ చేశారు. ఇందులో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. మరో రెండురోజులు తెనాలి, పరిసరాల్లోనే షూటింగ్ ఉంటుందని చెబుతున్నారు.

సాదిక్ హుసేన్‌కు సత్కారం



తెనాలి: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన తెనాలి యువకుడు షేక్ సాదిక్ హుసేన్‌ను శుక్రవారం యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో సత్కరించారు. 2019లో పేద ప్రజల సహాయం కోసం యంగ్ జనరేషన్ సంస్థను విద్యార్థులు స్థాపించారు. దాని ద్వారా పలు సేవల్ని అందజేస్తున్న సాదిక్ హుసేన్‌ను నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, కోచ్ మాలిక్, బి.మధు, ఎం.గోపాల్, జె.ఏసుబాబు, పి.శివప్రసాద్, వై.నవీన్ పాల్గొన్నారు.

13న రోటరీ క్లబ్ సభ్యత్వ నమోదు ర్యాలీ



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం మెంబర్‌షిప్ డ్రైవ్‌లో భాగంగా ఈనెల 13న పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ చెప్పారు. రోటరీ క్లబ్ బ్రేక్‌ఫాస్ట్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశాల్ని శుక్రవారం నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 15న ఉచిత దంత వైద్యశిబిరం, వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, ఆటల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటాయని తెలిపారు. వీటితోపాటు పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన సదస్సులు, రైతు సదస్సులు, యోగా తరగతులు నిర్వహించనున్నట్లు రాంబాబు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వర రావు, కోశాధికారి కె.ఎల్. జగదీశ్వరాంబ, ఈదర వెంకట పూర్ణచంద్ పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమం

- రెండో రోజు 30వ వార్డు సచివాలయం సందర్శన
- 'గడప గడపకు' వినతులపై సమీక్షించిన ఎమ్మెల్యే శివకుమార్



సచివాలయం సిబ్బందితో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. అందుకోసమే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమీక్షిస్తున్నామని చెప్పారు. అర్హత లేకపోతే అందుకు తగిన కారణాల్ని ప్రజలకు తెలియజేయడం తన బాధ్యతగా చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం పర్యటనలో ప్రజల్నుంచి వచ్చిన వినతులపై సమీక్షలో భాగంగా రెండోరోజైన శుక్రవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం పట్టణ చెంచుపేట అమరావతి కాలనీలోని 30వ వార్డు సచివాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జస్వంతరావు, వార్డు కౌన్సిలరు కొమరాబత్తిన జయపాల్, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల సహా ఎమ్మెల్యే శివకుమార్, వార్డు సచివాలయ సిబ్బందితో మాట్లాడారు.

వినతుల తిరస్కరణపై సమీక్ష

సచివాలయం పరిధిలో తాను ఇల్లిల్లు సందర్శించినపుడు ప్రజల్నుంచి వచ్చిన వినతులు మొత్తం 53 కాగా, 21 పరిష్కరించినట్టు చెప్పారు. 19 తిరస్కరణకు గురయ్యాయనీ, 13 పెండింగులో ఉన్నట్టు వివరించారు. తిరస్కరణకు కారణాల్ని సమీక్షించారు. విద్యాదీవెన రాలేదంటూ తన దృష్టికి తీసుకొచ్చిన తేలుకుట్ల విజయగణేష్‌తో ఎమ్మెల్యే స్వయంగా ఫోనులో మాట్లాడారు. సమస్య పరిష్కారమైందనీ, విద్యాదీవెన డబ్బులు వచ్చాయంటూ ఆ యువకుడు సంతోషంగా చెప్పాడు. ఎంయూడీ ఆపరేటరు నెలనెలా రేషను బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఎం.రమ్యకృష్ణ అప్పట్లో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దానిపైనా నేరుగా ఎమ్మెల్యే ఫోనులో మాట్లాడగా, ఇప్పుడు సక్రమంగానే పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. తిరస్కరించిన 19 వినతులపై సంబంధిత వ్యక్తులకు సహేతుక కారణాలతో తెలియజేస్తామని చెప్పారు. 30 సచివాలయం పరిధిలో 470 మందికి ఇళ్ల స్థలాల్ని అందజేసినట్టు తెలిపారు.

వార్డులో సంక్షేమం అమలుపై ఆరా

మధ్యాహ్నం వార్డు వలంటీర్లతో సమావేశమైన ఎమ్మెల్యే శివకుమార్, వారి బాగోగుల్ని అడిగి తెలుసుకున్నారు. వార్డులో సంక్షేమం అమలు, సామాజిక సమస్యల్ని ఆరా తీశారు. గంటన్నర పాటు సమీక్ష తదుపరి మధ్యాహ్నం ఆ ప్రాంత పార్టీ ప్రముఖుడు గుమ్మడి నారాయణరావు ఇంట్లో ఆ కుటుంబసభ్యులతో కలసి భోజనం చేశారు. వార్డు అభివృద్ధిపై ఆయన మనోగతాన్ని తెలుసుకున్నారు. అవసరమైన సూచనలు చేశారు. తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తలు, వలంటీర్లు, బూత్ ఏజెంట్లు, గృహసారథులతో సమావేశమయ్యారు. పార్టీ కార్యకర్తల యోగక్షేమాల్ని తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పనితీరుకు సలహాల్ని అడిగారు. సచివాలయం పరిధిలో కమ్యూనిటీ హాలుపై నిర్మాణంలో ఉన్న పైఅంతస్తు పనుల్ని పరిశీలించారు. 'వార్డులో ఒకరోజు పర్యటన' కార్యక్రమం ప్రజల సమస్యలపై తన జవాబుదారీతనానికి నిదర్శనంగా చెప్పారు. వారంలో నాలుగు రోజులపాటు నాలుగు వార్డుల్లో రోజంతా ఇదే తీరుగా ప్రజాసమస్యలపై సమీక్షిస్తూ, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. అర్హులు కాని వారికి ఆ విషయాన్ని తెలియజేస్తామని వివరించారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు !

కానిస్టేబుల్ రమేష్‌బాబు కుటుంబానికి ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ హామీ



కానిస్టేబుల్ రమేష్‌బాబుని పరామర్శిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీ కె.సుప్రజ

నగరంపాలెం: గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రమేష్‌బాబు కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని వేళల్లో అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ చెప్పారు. ఈనెల 5న తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో దుండుగుల్ని పట్టుకునే ప్రయత్నంలో అత్యంత ధైర్యసాహసాల్ని ప్రదర్శించి, గాయాలై గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తెనాలి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వై.రమేష్‌బాబు చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ శుక్రవారం మరోసారి ఆసుపత్రికి వెళ్లారు. కానిస్టేబుల్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. బాధితునికి అందిస్తున్న వైద్యసేవలపై ఎస్పీ ఆరా తీశారు. మెరుగైన చికిత్సను అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెప్పారు. ఎప్పటికప్పుడు అతని ఆరోగ్య పరిస్థితిపై పర్యవేక్షించాలని పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. ప్రస్తుతం కానిస్టేబుల్ ఆర్యోగ పరిస్థితి కొంత వరకు మెరుగుపడినట్లు వైద్యులు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, సీఐ బి.నరసింహారావు (ఎస్‌బీ), నగరంపాలెం పీఎస్ సీఐ హైమరావు పాల్గొన్నారు.

విద్యార్థులతో మట్టి నమూనాల సేకరణ



మట్టి నమూనా సేకరణలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

తెనాలి టౌన్: విద్యార్థులతో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు జరిపిన అనంతరం ఎరువుల్ని తగిన మోతాదులో వేసే విధంగా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. రూరల్ మండలం జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు, వ్యవసాయ శాఖ, ఆత్మ అధికారులు శుక్రవారం మట్టి నమూనాల్ని సేకరించారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల్ని ఇందులో భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. భూసార పరీక్ష ఫలితాల తర్వాత ఎరువులు, పెట్టుబడి ఖర్చు తగ్గించడం, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధన తదితర అంశాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మట్టి నమూనా కేంద్రం అధికారి డి.పద్మజ, ఆత్మ డీడీఏ పి.రామాంజనేయులు, తెనాలి ఏడీఏ ఎన్.ఉషారాణి, ఏవో జి.ప్రేమ్‌సాగర్, డీఆర్సీ ఏవో రాజహంస, ఎస్‌టీఏస్ ఏవో సత్య, జగ్గడిగుంటపాలెం, పెదరావూరు గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పంటల నమోదుతో పలు ఉపయోగాలు



పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో వెంకటరావు

కొల్లిపర: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు వివరాల్ని రైతు భరోసా కేంద్రంలో ఈ- క్రాప్ బుకింగ్ వెంటనే చేయించుకోవాలని ఏవో కె.వెంకటరావు సూచించారు. మండలంలోని మున్నంగిలో శుక్రవారం పొలంబడితో పాటు ఈ-క్రాప్ బుకింగ్ కార్యక్రమాల్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటల నమోదుతో బీమా, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటను మద్దతు ధరకు అమ్ముకోవడం, సున్నా వడ్డీ పంట రుణాలు, ఇతర ప్రభుత్వ వ్యవసాయ శాఖ పథకాలకు అర్హత పొందుతారని తెలిపారు. ప్రతి రైతూ తప్పకుండా ఆర్‌బీకే కేంద్రాల్లో సంబంధిత ధ్రువ పత్రాల్ని అందించి పంట నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం నిర్వహించిన పొలంబడిలో పొలం లేఅవుట్, భూసార పరీక్ష ఫలితాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

102 ఏళ్ల వృద్ధుడు శేషిరెడ్డికి సన్మానం



శేషిరెడ్డిని ఆనాటి జ్ఞాపకాలు అడిగి తెలుసుకుంటున్న విద్యార్థులు

మున్నంగి(కొల్లిపర): స్వాతంత్ర్య సంబరాల్లో భాగంగా మండలంలోని మున్నంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్) విద్యార్థులు శుక్రవారం స్వాతంత్ర్య పోరాటం కాలం నాటి సంఘటనలు ప్రత్యక్షంగా చూసిన గ్రామానికి చెందిన 102 ఏళ్ల ఆళ్ల శేషిరెడ్డిని శాలువాతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఆయన నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆనాడు బ్రిటిషర్లు మున్నంగిలో సాగించిన దురాగతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేషిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మున్నంగిలో బ్రిటిష్ ప్రభుత్వం ఎవరూ బయటకు రాకుండా మిలటరీ విధానం అమలు చేసిందన్నారు. తన తండ్రి వెంకటరెడ్డి గ్రామంలో అప్పటి మున్సబుగా ఉన్నారని, ఆయనతో పాటు అనుచరుల్ని జైల్లో పెట్టినట్లు తెలిపారు. తాను 25 సంవత్సరాల వయసులో తండ్రితో కలసి బ్రిటిష్ వాళ్లను, గాంధీ, నెహ్రూలను విజయవాడలలో చూశానంటూ ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. తన చిన్నతనంలో చక్రవర్తుల రాజగోపాలాచారిని దగ్గర నుంచి చూసినట్లు తెలిపారు. బ్రిటిషు వాళ్లు ప్రజల్ని ఎన్నో బాధలు పెట్టే వారని చెప్పారు. దేశంపై ప్రతి ఒక్కరు ప్రేమాభిమానాలతో ఉండాలని, ఒకరికి ఒకరు గౌరవించుకుంటూ అన్నదమ్ముల వలె ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, టీచర్ సోమరౌతు లక్ష్మీకమల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి టౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం తెనాలి పట్టణం, రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ డెప్యూటీ ఇంజనీర్ బి.అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులంతా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు



ప్రసూనారెడ్డి

తెనాలి: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా 2.0' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తపాలా శాఖ జాతీయ జెండాల పంపిణీని చేపట్టిందని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసూనారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా తయారైన జాతీయ జెండాల్ని రాష్ట్రంలోని ఏ పోస్టాఫీసు నుంచైనా పొందవచ్చని తెలిపారు. 30/20 సైజులోని జాతీయ పతాకాన్ని రూ.25 నామమాత్రపు ధరతో కొనుగోలు చేయొచ్చని, పెద్ద మొత్తంలో కొనుగోలు చేయదలచినవారు వి.పవన్‌కుమార్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (9441452484) లేదా స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ సేవల్ని వినియోగించుకుని రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా భారీగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రేపు తెనాలిలో ఫ్యాషన్ షో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి అర్బన్: గుమ్మడి ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం తెనాలిలో ఫ్యాషన్ షో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు గుమ్మడి సాయి భామా చౌదరి, పరుచూరి రమ్య పేర్కొన్నారు. నందులపేటలోని గుమ్మడి ఈవెంట్స్ కార్యాలయంలో శుక్రవారం ఫ్యాషన్ షో బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరూ పాల్గొనవచ్చని తెలిపారు. స్వర్ణ ఇన్ హోటల్‌లో ఉదయం 10 గంటలకు షో ప్రారంభమవుతుందని, గెలుపొందిన వారికి బహుమతులు కూడా ఉంటాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుమ్మడి సాయివాణి, సుధామాధవి, అల్లం లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ సుబ్బారావు, సీతమ్మ

తెనాలి టౌన్: జాతీయ నులుపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం రూరల్ మండలం కొలకలూరు శివారు ఖాజీపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులిపురుగు మాత్రలు పంపిణీ చేశారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు, సొసైటీ సభ్యురాలు చక్కా సీతమ్మ, స్కూల్ హెచ్‌ఎం సీతారామిరెడ్డి విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 38 పాఠశాలలు, 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసినట్లు చెప్పారు. మిగిలి పిల్లలకు ఈ నెల 17న ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ దిలీప్, సూపర్‌వైజర్స్ లక్ష్మీప్రసన్న, ఎం.వెంకటరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు శిరీష, శ్రీనివాస్, సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- హాజరైన 1482 మంది అభ్యర్థులు
- ఉద్యోగాలకు 411 మంది ఎంపిక



ఆఫర్ లెటర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ, గుంటూరు జిల్లా సహకారంతో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. రాష్ట్రంలోని 30 పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఆయా కంపెనీల్లో దాదాపుగా 1100 ఉద్యోగ అవకాశాలు ఉండగా, 1482 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం 560 మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి. ఏఎస్ఎన్ కాలేజీ ఆవరణలో సాయంత్రం ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. కెరీర్‌లో చక్కగా పనిచేస్తూ ఉన్నత అవకాశాలను అందుకోవాలని సూచించారు. ఉదయం జరిగిన జాబ్‌మేళా ప్రారంభ సభకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి ప్రసన్నకుమార్ అధ్యక్షత వహించారు.ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, తమ కాలేజీ విద్యార్థులే కాకుండా చదువుకుని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నియోజకవర్గంలోని యువతకు తగిన వేదిక కల్పించాలనే లక్ష్యంతోనే ఏటా మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికి మూడుసార్లుగా నిర్వహించిన జాబ్‌మేళాలతో రెండు వేలమందికి పైగా ఉద్యోగాలు పొందినట్టు చెప్పారు. ప్రస్తుత జాబ్‌మేళానూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఉపాధి కల్పనా సంస్థ అధికారి రాజారావు మాట్లాడుతూ కంపెనీలు విడివిడిగా కాకుండా ఉమ్మడిగా ఇంటర్వ్యూలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంపై ఒక్కో నెల ఒక్కో నియోజకవర్గంలో మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, ఏఎస్ఎన్ కాలేజీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిరంతర ప్రక్రియగా చెప్పారు. కాలేజీ నుంచి ఎందరో ఉన్నత ఉద్యోగాల్లో, సొంత కంపెనీల నిర్వహణలో ఉన్నట్టు చెప్పారు. వీరితోపాటు తెనాలి ప్రాంతంలోని నిరుద్యోగుల కోసం ఎమ్మెల్యే శివకుమార్ ఏటా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వివరించారు.

ఘనంగా శ్రీరామ్ ఫైనాన్స్ స్వర్ణోత్సవం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

తెనాలి రూరల్: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ స్వర్ణోత్సవాన్ని ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తెనాలి శాఖ కార్యాలయం వద్ద 40మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం జరిగిన వేడుకల్లో ప్రాంతీయ రవాణాశాఖ అధికారి కె.ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్థ తరపున మరింత మందికి ఆర్థిక చేయూత కల్పిస్తూ వారి అభివృద్ధికి దోహదపడాలని ఆర్టీవో సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ రీజినల్ మేనేజర్ సూర్యనారాయణ, ఉమ్మడి గుంటూరు జిల్లా ఇన్వెస్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ శివరామకృష్ణ, బ్రాంచి మేనేజర్ పోతురాజు, గోపి, నాగేంద్ర, అంబటి మారుతీ, రామ వందన పాల్గొన్నారు.

పంచాయతీల వార్డు మెంబర్ల నామినేషన్ల పరిశీలన

రేపల్లె రూరల్: మండలంలోని పంచాయతీల వార్డు మెంబర్ల ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల పరిశీలన పూర్తయినట్లు ఎంపీడీవో శివపార్వతి శుక్రవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. చాట్రగడ్డ 3, 8వ వార్డులకు ఒక్కొక్కటి, బేతపూడి 7వ వార్డుకు మూడు, రాజుకాల్వ 5వ వార్డుకు ఒక నామినేషన్ దాఖలైనట్లు తెలిపారు. ఆరు నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని చెప్పారు. శనివారం ఉప సంహరణ ఉంటుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

